కొనుగోలు కేంద్రాలు మూసి ఉంచొద్దు

చేగుంట: కొండపూర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గియానిస్సా బేగం

రామాయంపేట: కొనుగోలు కేంద్రం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తహసీల్దార్ రజినీకుమారి

చేగుంట: ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద లారీలో లోడింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

- కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలి
- చేగుంట తహసీల్దార్ గియానిస్సాబేగం
- రామాయంపేటలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన తహసీల్దార్ రజినికుమారి

చేగుంట, ఏప్రిల్ 20: రైతుల మేలుకోరి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని, ధాన్యం రావడంలేదనే సాకుతో కేంద్రాలు మూసి ఉంచొద్దని కేంద్రాల నిర్వాహకులకు తహసీల్దార్ గియానిస్సాబేగం ఆదేశించారు. నమస్తే తెలంగాణలో శనివారం 'ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూత' ఇబ్బందుల్లో రైతులు అనే శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన తహసీల్దార్ శనివారం చేగుంటతోపాటు మండలంలోని ఉల్లితిమ్మాయిపల్లి, రుక్మాపూర్, ఇబ్రహీంపూర్, బీ కొండపూర్, అనంతసాగర్, ఇబ్రహీంపూర్, బోనాల్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడువకుండ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బీ కొండపూర్‌లో ఉదయం వర్షం పడడంతో ధాన్యం బస్తాలు తడిసినట్లు ఆమె తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల నుంచి రైస్‌మిల్స్‌కు ఎప్పటికప్పుడు తరలించాలని నిర్వాహకులకు తహసీల్దార్ సూచించారు. ఆమెతో ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, ఐకేపీ, సొసైటీ సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.

కేంద్రం నిర్వాహకులపై తహసీల్దార్ ఆగ్రహం

రామాయంపేట, ఏప్రిల్ 20: నమస్తే తెలంగాణ పత్రికలో శనివారం వచ్చిన వసతుల్లేని ధాన్యం కొనుగోలు కేంద్రం అనే కథనానికి స్పందించిన తహసీల్దార్ రజినీకుమారి కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం వద్ద ధాన్యం రాశులు పోసి ఉన్నా టార్పాలిన్ కవర్లు ఎందుకు కప్పలేదని ప్రశ్నించారు. ధాన్యం తడిస్తే ఎవరు బాధ్యులని నిలదీశారు. ధాన్యం తడిస్తే కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద టెంటు, నీటి వసతి లేకపోవడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే అక్కడికి టెంటు, నీటి సౌకర్యం కోసం ఆదేశాలు జారీ చేసి, తెప్పించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు.

చేతికొచ్చిన పంట వర్షార్పణం

- కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం
- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన వడ్లు
- మందకొడిగా సాగుతున్న కొనుగోళ్లు
- రామాయంపేటలో కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అధికారులు

సిద్దిపేట మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం

సిద్దిపేట, ఏప్రిల్ 20: ఆరుగాలం శ్రమించిన రైతన్నకు అకాల వర్షాలు నష్టాలను తెచ్చిపెట్టాయి. చేతికొచ్చిన పంట అమ్మేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే వారం రోజుల నుంచి కొనకపోవడంతో అకాల వర్షంతో ధాన్యం తడిసిముద్దయ్యింది. సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో వారం రోజులుగా ధాన్యం పోసి ఉంచారు. కొనుగోలు కేంద్రాల్లో వసతుల కొరతతో ధాన్యం వెంటనే కొనకపోవడంతో శనివారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి రైతులకు అపార నష్టం కలిగింది. క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు జరగడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనాలని కోరుతున్నారు. ఈ విషయంపై సిద్దిపేట సొసైటీ అధికారిని అడగగా ఇప్పటివరకు 56 మంది రైతుల వద్ద 6250 బస్తాలు కొన్నామని, తడిసిన ధాన్యంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

రామాయంపేట డివిజన్‌లో భారీ వర్షం

రామాయంపేట, ఏప్రిల్ 20: రామాయంపేట వ్యవసాయ శాఖ డివిజన్ వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు భారీ వర్షం పడడంతో ధాన్యం తడిసిపోయింది. రామాయంపేట, నిజాంపేట మండలం నస్కల్, నార్సింగిలో భారీగా వర్షం కురిసింది. రామాయంపేటలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ధాన్యాన్ని నీళ్లలో నుంచి తొలిగిస్తున్నారు. నోటికాడికి వచ్చిన ధాన్యం వర్షానికి తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ, పీఏసీఎస్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టాలని తహసీల్దార్ రజినీకుమారి తెలిపారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం

నిజాంపేట, ఏప్రిల్ 20: నిజాంపేట మండలంలో శనివారం కురిసిన వర్షానికి పంటలు నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల వద్ద, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు పంట కోతను నిలిపేశారు.

తూప్రాన్‌లో పేరుకుపోయిన ధాన్యం

తూప్రాన్, ఏప్రిల్ 20: తూప్రాన్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. మండలంలో 10 కొనుగోలు కేంద్రాలు ఐకేపీ ఆధ్వర్యంలో ఈనెల 6న ప్రారంభించారు. కానీ కొనుగోళ్లు మాత్రం మందకొడిగా సాగుతున్నాయి.

ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలి - అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా, రైతులు నష్టపోకుండా నివారణ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శనివారం మెదక్ కలెక్టరేట్‌లో డీఆర్‌డీవో, డీసీవో, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్, ధాన్యం సేకరణ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలన్నారు. టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలన్నారు.

పొద్దు తిరుగుడుకు మద్దతు ధర రూ.6760

జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టార్ పండిత్



రామాయంపేటలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రామాయంపేట, ఏప్రిల్ 20: పొద్దు తిరుగుడు పంటకు మద్దతు ధర రూ.6760 నిర్ణయించినట్లు జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టార్ కె.పండిత్, ఏడీఏ వసంత సుగుణ తెలిపారు. రామాయంపేట మార్కెట్‌లోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ పండిత్ మాట్లాడుతూ రామాయంపేట, శంకరంపేట మండలాల్లో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. రామాయంపేట మండలంలో 381 ఎకరాల్లో పొద్దు తిరుగు డు పంట వేశారన్నారు. మండలంలో మొత్తం పంట 3048 క్వింటాళ్లు పండించారని, ఈ ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ అధికారి తిరుపతి, మండల వ్యవసాయ శాఖ అధికారులు రాజ్‌నారాయణ, సతీశ్, సీఈవో పుట్టి నర్సింహులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

శివాయిపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

రామాయంపేట రూరల్, ఏప్రిల్ 20: మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని శివాయిపల్లి, ప్రగతి ధర్మారం గ్రామాల్లో నాయకులు శనివారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, శ్రీహరియాదవ్, సిద్దిరాంరెడ్డి, బొడ్డు శంకర్, దేశెట్టి లింగం పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

శేషిరెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిలిపిచెడ్, ఏప్రిల్ 20: మండలంలోని ఫైజాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల నాయకుడు అంతిరెడ్డి గారి శేషిరెడ్డి(52) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై కుటుంబీకులను పరామర్శించి, ఓదార్చారు. అనంతరం శేషిరెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే, ఎంపీటీసీ మల్లమ్మ సంగాగౌడ్, మాజీ సర్పంచ్ మనోహర నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడిద్దాం

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చుక్క రాములు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 20: కేంద్రంలో బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో మతోన్మాదం పెరిగిందని, ప్రశ్నించే వారిపై దాడులు పెరిగాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. శనివారం మెదక్ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగానికి పెను ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన నరేంద్రమోడీ ప్రభుత్వం నేటికి ఎన్ని కోట్ల ఉద్యోగాలు భర్తీ చేశారని ప్రశ్నించారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను సకాలంలో అందించడంలో విఫలమైందన్నారు. దేశంలో కార్మికులు, శ్రమజీవులు, మధ్యతరగతి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరిస్తూ సీబీఐ, ఈడీ, ఈసీ వంటి చట్టబద్ద సంస్థలను తన రాజకీయ ప్రత్యర్థులను దెబ్బ తీసేందుకు దుర్వినియోగం చేస్తున్నదన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం, కార్యవర్గ సభ్యులు నర్సమ్మ, నాయకులు బస్వారాజు, మల్లేశం, మహేందర్‌రెడ్డి, నాగరాజు , బాల మణి, తూకరాం, కాళిదాస్, అశోక్, నర్సింలు, రాములు పాల్గొన్నారు.

9 మంది అభ్యర్థులు.. 10 నామినేషన్లు

- అందరూ ఇండిపెండెంట్ అభ్యర్థులే

మెదక్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): మెదక్ ఎంపీ స్థానానికి శనివారం మూడో రోజు 9 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు 10 నామినేషన్లు దాఖలుచేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు గొటి మల్లేశం, దుబాల శ్రీశైలం, సత్యనారాయణగౌడ్, చిక్కులపల్లి నవీన్‌కుమార్, కొల్కూర్ ప్రతాప్, భుజంగం, లక్ష్మణ్, బండపల్లి శ్రీనివాస్ ఒక్కో నామినేషన్ దాఖలు చేశారు. నాగమణి రెండు సెట్ల నామినేషన్ దాఖలుచేశారు. మెదక్ ఎంపీ స్థానానికి శనివారం 9 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్ వేసినట్లు రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ తెలిపారు.

మెదక్ ఎంపీ స్థానానికి ఇండిపెండెంట్‌లుగా నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థులు

నీలం మధు నామినేషన్‌కు తరలిన నాయకులు

నీలం మధు నామినేషన్‌కు తరలుతున్న నాయకులు

నర్సాపూర్, ఏప్రిల్ 20: మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్‌కు నర్సాపూర్ నుంచి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ శనివారం మెదక్‌కు బయలుదేరారు. మంత్రి కొండా సురేఖ, ఎంపీ అభ్యర్థి నీలం మధుకు నర్సాపూర్‌లో ఘనంగా స్వాగతం పలికారు. వారితో మాజీ ఎంపీపీ లలిత, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత, మండల అధ్యక్షుడు మల్లేశం, నాయకులు సుహాసిని, మణిదీప్, అశోక్‌గౌడ్, హంసీబాయ్, హబీబ్‌ఖాన్, సాగర్ ఉన్నారు.

నేల అనుకుంటే పొరబడ్డట్టే..

చిలిపిచెడ్,ఏప్రిల్ 20: చిత్రంలో కనిపిస్తున్నది నేల అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే. చిలిపిచెడ్ మండలంలోని చాముండేశ్వరీ ఆలయం వద్ద మెదక్, సంగారెడ్డి జిల్లా సరిహద్దులోని మంజీరా నది బ్రిడ్జి కింద గుర్రపు డెక్కలతో నిండిపోయింది. నేలలా కనిపిస్తున్నది. నదిలో గుర్రపుడెక్కలు తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

అక్కన్నపేటలో ముదిరాజ్ సంఘ భవనం ప్రారంభం

ముదిరాజ్ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న కులస్తులు

రామాయంపేటరూరల్, ఏప్రిల్ 20: రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో ముదిరాజ్ సంఘ భవనాన్ని శనివారం ప్రారంభించారు. సంఘం అభివృద్ధికి భవిష్యత్ కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని వారు తెలిపారు. కుల సభ్యులు జెండా ఎగరవేశారు. అనంతరం పెద్దమ్మ బోనాలు ఊరేగించారు.

సాంకేతిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 20: సాంకేతిక పది, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సాంకేతిక పది, ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై డీఈవో రాధాకిషన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత జాగ్రత్తతో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఎలాంటి పొరపాట్లు జరిగినా విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందన్నారు. ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు సజావుగా జరిగేలా పని చేయాలని సూచించారు. జిల్లాలో పదో తరగతిలో 680 మందికి మెదక్, నర్సాపూర్, తూప్రాన్‌లో ఒక్కో కేంద్రం, ఇంటర్‌కు 1060 మంది మెదక్‌లో 2, నర్సాపూర్‌లో 2, తూప్రాన్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఒక సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, ఆర్టీసీ మేనేజర్ సుధ, పోస్టల్ అధికారి దౌలత్‌బాషా, ట్రాన్స్‌కో అధికారి మోహన్‌బాబు, పట్టణ సీఐ దిలీప్‌కుమార్, పరీక్ష సహాయ కమిషనర్ రామేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఆరీఫ్

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 20: మద్దూరు మండల కేంద్రానికి చెందిన మైనార్టీ రాష్ట్ర నాయకుడు, అయిషాబీ ట్రస్ట్ చైర్మన్ ఖాజా ఆరీఫ్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ముస్లిం, మైనార్టీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

టోకెన్ ఇచ్చి, కాంటా పెట్టలేదు

15 రోజుల క్రితం సిద్దిపేట మార్కెట్ యార్డ్‌కు ధాన్యం తీసుకొచ్చిన. నాలుగు రోజుల కిందట తేమ శాతం చూసి ధాన్యం కొనుగోలుకు టోకెన్, సంచులు ఇచ్చారు. ఇప్పటివరకు వడ్లు కాంటా పెట్టలేదు. శనివారం పొద్దున పడ్డ వానతో వడ్లు తడిసిపోయినయ్. ఇప్పటికైనా తొందరగా వడ్లు కాంటా పెడితే ఇబ్బంది లేకుండా ఉంటుంది.

- మల్లారెడ్డి, రైతు, రాఘవేంద్రనగర్

కాంటా అయినా సంచులు తీసుకుపోలేదు

11 రోజుల కింద ధాన్యం తీసుకొచ్చిన. వడ్లు ఆరలేదని చెప్పి మొన్నటి దాకా టోకెన్ ఇవ్వలే. టోకెన్, సంచులు ఇచ్చింద్రు, కాంటా పెట్టింద్రు. లారీ లోడు ధాన్యం అయ్యినంక తీసుకుపోతమన్నరు. ఇప్పటిదాకా తీసుకుపోలే. ఇప్పుడు వర్షంతో సంచులన్నీ తడిసినయ్. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు తీసుకోవాలి.

- గూడ కనకలక్ష్మి, మహిళా రైతు, ఇమామ్‌బాద్, సిద్దిపేట

మద్దతు ధర సరే.. కొనుడెప్పుడు?

దాతర్‌పల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభించి 15 రోజులవుతున్నది. కానీ ఇంతవరకూ కొనేటోడే దిక్కు లేడు. నాలుగైదు రోజుల నుంచి వాతావరణం కింద మీద ఉండడంతో ఆగమాగం అయితాంది. పొద్దుగళ్ల రాత్రి మొత్తమంత ఈడనే సరిపోతున్నది. గిట్ల వర్షాలు వస్తే వడ్లు మొత్తం కొట్టుకపోతయి. ఇగ మా బతుకు ఆగమే.

- గణేశ్, రైతు, దాతర్‌పల్లి, తూప్రాన్

అనుమతుల్లేని డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్, ఏప్రిల్ 20: హుస్నాబాద్ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు రాజన్‌నాయక్ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. శనివారం హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్ పట్టణంలో ఇటీవల డయాగ్నోస్టిక్ సెంటర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని, వీటిలో చాలా వాటికి అనుమతులు లేవన్నారు. అనుభవం లేని ల్యాబ్ టెక్నీషియన్స్ తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో రోగులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్లపై సంబంధిత వైద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు తిరుపతినాయక్, లకావత్ రమేశ్‌నాయక్ ఉన్నారు.

పూరి గుడిసె దగ్ధం

విద్యుత్ షాక్‌తో దగ్ధమైన పూరి గుడిసె

నర్సాపూర్, ఏప్రిల్ 20: విద్యుత్ షాక్‌తో పూరి గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు తన భార్యతో కలిసి ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. విద్యుత్ షాక్‌తో తన గుడిసెలో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు గమనించి నర్సింహులుకు సమాచారం అందించారు. అప్పటికే గుడిసెలోని సామగ్రి మొత్తం పూర్తిగా కాలిబూడిదైంది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LAND FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్డు, SBI దగ్గర, 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630, 9989554915
NT-5273

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

CHANGE OF NAME

★I, KASHABOINA PARSHARAMULU S/o. KASHABOINA MALLAIAH (Old name) R/o. H.No. 5-62, Bhoompally, Akbarpet Bhoompally (Mandal) Siddipet Dist. I Changed my former name/ surname to KASABOYEENA PARSHARAMULU S/o KASABOYEENA MALLAIAH (New Name) for future purpose
NT-667]

LOST

★I, SRI KANDULA ANJAJAH S/o KONDALAH, R/o Bollaram village, JinnaramMandal, Medak District, lost document no. 942/2005, while traveling from Bollaram to Sangareddy if found pls contact me 9000944481
NT-311991

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.